
సాక్షి నంద్యాల

బుధవారం : 3 : జనవరి : 2024



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలాలయ ప్రాంగణంలోని నందీశ్వరునికి, బయలువీరభద్ర స్వామికి మంగళవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాన్ని సమర్పించారు.



కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి మంగళవారం కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో 0.782 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



వృద్ధులకు హోమ్ ఓటింగ్

వృద్ధులు, శారీరక వికలత్వం కలిగిన ఓటర్లు వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ..8లో▸

న్యూస్‌రీల్

830 అడుగులకు చేరిన శ్రీశైలం డ్యామ్ నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయం నీటిమట్టం రోజురోజుకు తగ్గుతుంది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు నిత్యం నీటి విడుదల జరుగుతుండడం, జలాశయానికి ఇన్‌ఫ్లో లేకపోవడంతో నీటి మట్టం క్రమేపి తగ్గుతుంది. మంగళవారం సాయంత్రానికి డ్యామ్‌నీటిమట్టం 830 అడుగులకు చేరుకుంది. సోమవారం నుంచి మంగళవారం వరకు 2,517 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తెలంగాణ ప్రాంతంలోని ఎడమగట్టు భూగర్భ జలవిద్యుత్‌కేంద్రంలో 0.375 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి 786 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. బ్యాక్‌వాటర్ నుంచి హంద్రీనీవా సుజలప్రవంతికి 960 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 49.4900 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రైళ్ల రద్దు కొనసాగింపు

నంద్యాల(సిటీ): గుంటూరు–డోన్ డివిజన్ పరిధిలో జరుగుతున్న రైల్వే డబ్లింగ్ పనుల కారణంగా గుంటూరు–డోన్, డోన్–గుంటూరు మధ్య తిరిగే పలు రైళ్లను తాత్కాలికంగా చేసిన రద్దు కొనసాగిస్తున్నట్లు నంద్యాల రైల్వే స్టేషన్ మాస్టర్ దొరస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు–డోన్ (17228), డోన్ నుంచి గుంటూరు (17227), గుంటూరు–కాచిగూడ(17251), కాచిగూడ–గుంటూరు (17252) రైళ్ల రద్దు ఈ నెల 28 వరకు కొనసాగింపు ఉంటుందన్నారు. అదేవిధంగా మంగళవారం నుంచి హుబ్లీ–విజయవాడ (17329), విజయవాడ–హుబ్లీ (17330) రైళ్లు పునఃప్రారంభమయ్యాయన్నారు.

గాలికుంటు వ్యాధి టీకా పంపిణీ ప్రారంభం

- జిల్లా పశుసంవర్థక శాఖాధికారి గోవిందనాయక్



నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ మంగళవారం నుంచి ప్రారంభించినట్లు జిల్లా పశుసంవర్థక శాఖాధికారి గోవిందనాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 4,14,395 పశువులకు గాను 3,72,600 డోసులు సిద్ధంగా ఉంచామన్నారు. ఈ నెలాఖరు వరకు గ్రామాల్లోని నాలుగు నెలలు నిండిన దూడలు, ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. పశువులకు సోకిన గాలికుంటు వ్యాధిని సకాలంలో గుర్తించి నివారించుకోవటం మినహా పూర్తిగా నిర్మూలించేందుకు మందులు లేవన్నారు. వ్యాధి సోకిన పశువుకు 14 నుంచి 106 డిగ్రీల జ్వరం వస్తుందని, నోటి వద్ద బొబ్బలు, కాలిగిట్టల వద్ద బొబ్బలు ఏర్పడుతాయన్నారు. నడవటానికి, మేత మేయడానికి ఇబ్బంది పడతాయన్నారు.సొంగ కార్చటంతో పాటు పాలదిగుబడి తగ్గిపోతుందన్నారు. వైరస్ నుంచి రక్షించేందుకు బోరో గ్లిజరిన్ పేస్టును నోటిలో,డెక్కల మధ్య పుండ్లకు పూతగా రాయాలన్నారు. యాంటి బయాటిక్స్ మందులు ఇస్తూ నొప్పి తగ్గించేందుకు మందులు వాడాల్సి ఉంటుంది. తేలికగా జీర్ణమయ్యే ఆహారం పశువులకు ఇవ్వాలన్నారు. వ్యాధి సోకిన పశువుల నుంచి వైరస్ ప్రబలకుండా మంద నుంచి వేరు చేయటంతో పాటు పాకల్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన పశువులకు వ్యాధి నివారణా టీకాలు ఈ నెల 2వ తేదీ నుంచి వేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన పరీక్షలకు 90 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 7,288 మంది విద్యార్థులకు గాను 6,585 మంది హాజరైనట్లు పరీక్షల విభాగం అధికారులు తెలిపారు.

మల్లన్నకు అభివృద్ధి హారం

- శ్రీగిరిలో భక్తుల సౌకర్యాలకు పెద్దపీట
- ఇటీవలే రూ.125 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- గడువులోగా పూర్తయ్యేలా పకడ్బందీ ప్రణాళిక
- రూపురేఖలు మారనున్న శ్రీశైల క్షేత్రం



సాలు మండపాల నమూనా

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల క్షేత్రంలో అభివృద్ధి పరిమళాలు వెదజల్లుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోంది. నల్లమల అభయారణ్యంలో వెలిసిన శ్రీశైల మల్లన్న దర్శనార్థం వచ్చే భక్తులు ఆధ్యాత్మిక, ఆహ్లాదకర, ప్రశాంత వాతావరణంలో ఓలలాడేలా వసతుల కల్పనకు చర్యలు చేపట్టింది. శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకు గణనీయంగా పెరుగుతుంది. ఈ క్రమంలో భక్తుల రద్దీకి అనుగుణంగా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సిన అవసరం ఏర్పడింది. క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం సుమారు రూ.125.04కోట్లతో పలు అభివృద్ధి పనులకు దేవస్థానం శ్రీకారం చుట్టింది. నూతన క్యూ కాంప్లెక్స్, సాలు మండపాలు, వాటర్ స్టోరేజీ ట్యాంక్‌లు, సబ్ స్టేషన్, సోలార్ పవర్‌ప్లాంట్, శివసేవకుల వసతి సముదాయం, 204 గదుల వసతి సముదాయం, పంచమఠాల ఆవరణ సుందీకరణ, దోర్నాల వద్ద షాపింగ్ మాల్, కల్యాణ మండప నిర్మాణం తదితర పనులు చేపట్టేందుకు ప్రణాళి రూపొందించారు. ఇందులో భాగంగా ఆయా అభివృద్ధి పనులకు డిసెంబరు నెల 27న సాలు మండపాల నిర్మాణానికి భూమిపూజ, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేపట్టారు. ఈ మహోత్తర కార్యక్రమానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై భూమిపూజ, శంకుస్థాపన చేశారు. గడువులోగా పనులన్నీ పూర్తి చేసేలా దేవస్థానం అధికారయంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

నూతన క్యూ కాంప్లెక్స్

శ్రీశైలంలో ప్రస్తుతం ఉచిత క్యూ కంపార్ట్‌మెంట్లు రేకుల షెడ్డులో ఉన్నాయి. ఇందులో మూడు, నాలుగు వేల మంది భక్తులు మాత్రమే వేచి ఉండే అవకాశం ఉంది. మహాశివరాత్రి, ఉగాది, కార్తీక మాసంలో భక్తులు సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఇందుకోసం రూ.75 కోట్ల అంచనా వ్యయంతో అధునాతన సదుపాయాలతో ఒకేసారి సుమారు 10,240 మంది భక్తులు వేచి ఉండేలా 40 కంపార్ట్‌మెంట్లు, 8 అదనపు గదులతో ప్రధాన ఆలయం దక్షిణ వైపు నూతన క్యూకాంప్లెక్స్ నిర్మించబోతున్నారు.

మంచినీటి వసతి కల్పన

మంచినీటి సరఫరాలో భాగంగా పలుచోట్ల ఓవర్‌హెడ్ వాటర్ స్టోరేజ్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. రూ.11.70 కోట్లతో హఠకేశ్వరం వద్ద 5 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకు, 2 లక్షల లీటర్ల సామర్థ్యంతో గ్రౌండ్ లెవల్ వాటర్ సంప్, ఫిల్టర్‌బెడ్ వద్ద 5లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకు, మల్లమ్మ మందిరం సమీపంలో 10లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించనున్నారు. అలాగే శ్రీశైలం ప్రాజెక్టు కాలనీ(సున్నిపెంట)లో నిర్మిస్తున్న సిబ్బంది వసతి గృహాల వద్ద ఒక్కొక్కటి 630 కేవీఏ సామర్థ్యం కలిగిన 3 ట్రాన్స్‌ఫార్మర్లు, 3 జనరేటర్లు రూ.5.85 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తున్నారు.

ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..

శ్రీశైలంలో జరిగే ఉత్సవాల్లో స్వామిఅమ్మవార్ల ఉత్సవాలను, రథోత్సవాన్ని భక్తులందరూ తిలకించేలా, ప్రధాన ఆలయానికి ఇరువైపులా, తూర్పు, దక్షిణ వీధుల్లో ఉన్న శాశ్వత దుకాణాలను తొలగించారు. నందిసర్కిల్ నుంచి గంగాధర మండపం, గంగాధర మండపం నుంచి బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు ఉన్న ప్రదేశంలో దుకాణాలను తొలగించి చదును చేశారు. ఆ ప్రదేశంలో రూ.35 కోట్లతో సువిశాలమైన సాలు మండపాలు నిర్మించనున్నారు. 224 స్తంభాలతో దేవతామూర్తుల ఆకృతులు ప్రతిబింబించే విధంగా సాలు మండపాల నిర్మాణశైలి ఉండనుంది. అలాగే శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారి ఆలయంలో రూ. 99 లక్షలతో ఉత్తరసాలు మండపాల కూడా పునః నిర్మాణం చేపట్టనున్నారు.

రూ.7కోట్లతో సోలార్ పవర్‌ప్లాంట్

సంప్రదాయేతర ఇంధనవనరుల వినియోగంలో భాగంగా ఫిల్టర్‌బెడ్ సమీపంలో ఒక మెగా వాట్ సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబడుతున్న ఈ పవర్‌ప్లాంట్ అంచనా వ్యయం రూ.7కోట్లు. దీని ద్వారా రోజుకు 4000 నుండి 5000 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. ఈ విద్యుత్ ఉత్పత్తి వలన సంవత్సరానికి రూ.1.30 నుంచి రూ.1.40 కోట్లు దేవస్థానానికి ఆదా అవుతుంది.

శివ సేవకుల కోసం..


శ్రీశైల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ఉచితంగా తమ సేవలు అందిస్తున్న శివసేవకులకు రూ.23.40 కోట్లతో వసతి సముదాయాన్ని నిర్మిస్తోంది. నందికేశ సదన్ సమీపంలో విశాలమైన 48 గదులతో ఈ వసతి సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఈ వసతి సముదాయంలో 1,500 మందికిపైగా శివసేవకులు వసతి పొందవచ్చు.

204 గదుల వసతి సముదాయం

శ్రీశైల మహాక్షేత్రంలో స్వామిఅమ్మవార్ల దర్శనార్థం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో భక్తులకు సరిపడా వసతి సౌకర్యం అందుబాటులో లేదు. ఇందుకోసం గణేశ సదన్ పక్కన దేవస్థానం రూ.52 కోట్లతో 204 గదుల వసతి సముదాయాన్ని నిర్మిస్తుంది. ఇందులో 172 డీలక్స్ గదులు, 32 సూట్ గదులు నిర్మిస్తున్నారు.



200 రూమ్స్ కాటేజ్ నమూనా



క్యూకాంప్లెక్స్ నమూనా



శివసేవకుల డార్మెటరీ నమూనా



దోర్నాల వద్ద సౌకర్యాల కల్పన

రూ.1.26 కోట్లతో ప్రకాశం జిల్లా దోర్నాల వద్ద దేవస్థాన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. అలాగే రూ.1.98 కోట్లతో ప్రకాశం జిల్లా దోర్నాల వద్ద నూతన కల్యాణమండపాన్ని నిర్మించనున్నారు. అలాగే రూ.86లక్షలతో పంచమఠాలన్నింటిని భక్తులు ఒకేసారి దర్శించేలా ఏకరూట్ ఏర్పాటుతో పాటు పంచమఠాల వద్ద సుందరీకరణ, పచ్చదనం తదితర పనులు చేపట్టనున్నారు.

భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత



శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యత ఇచ్చి ఇటీవల అభివృద్ధి పనులకు మంత్రి సత్యనారాయణ, ఎమ్మెల్యే శిల్పా చేతుల మీదుగా భూమిపూజ, శంకుస్థాపనలు చేశాం. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. ఆయా అభివృద్ధి పనులు పూర్తయితే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందనున్నాయి. శ్రీశైల యాత్రకు విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యానికి లోనుకాకుండా అన్ని సౌకర్యాలు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

– రెడ్డివారి చక్రపాణిరెడ్డి, శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్

త్వరలో నిర్మాణ పనులు



శ్రీశైల మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం రూ.125 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాం. ఆయా పనులకు శంకుస్థాపనలు చేశాం. త్వరలోనే అభివృద్ధి పనులను ప్రారంభించి, కాలపరిమితి లోపే పనులను పూర్తి చేస్తాం. నిర్మాణ పనులు పూర్తి నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తాం. ఆయా అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి సకాలంలో పూర్తి చేస్తాం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

ఆనందమానందమాయె!

- రూ. 3 వేల పింఛన్‌తో లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన సంతోషం
- పండుగలా పింఛన్ల పంపిణీ వారోత్సవాలు



లబ్ధిదారులకి పింఛన్ సొమ్ము అందిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


నంద్యాల(న్యూటౌన్): వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే రూ. వెయ్యి ఉన్న పింఛన్‌ను రూ. 3 వేల వరకు పెంచుకుంటూ పోతానని లబ్ధిదారులకు ఇచ్చిన మాట ను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారు. నూత న సంవత్సర కానుకగా రూ. 3 వేల పింఛన్ మంగళ వారం లబ్ధిదారులు అందుకుని సంబరపడ్డారు. జిల్లా లో పింఛన్ల పంపిణీ పండుగలా నిర్వహిస్తున్నారు. గడివేముల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో అర్హులైన పింఛన్ దారులందరికీ ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి చేతుల మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విడతల వారీగా పింఛన్ పెంపు చేయడం సంతోషకరమన్నారు.

☛ కొలిమిగుండ్లలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి లబ్ధిదారులకు నూతన పింఛన్లు అందజేశారు. కరోనా విపత్తుతో ఆర్థిక పరిస్థితులు సరిగా లేక పోవడంతో పాటు ఎన్నో రకాల అడ్డంకులు ఎదురైనా సంక్షేమ పథకాల అమల ను సీఎం జగన్ నిలపలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 64 లక్షల పింఛన్ ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కిందన్నారు. ఎవరి ఊహకు అందని విధంగా పరిపాలనలో సమూలమైన మార్పులు తీసుకొచ్చారన్నారు.

☛ ఆళ్లగడ్డ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, జలవనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రభుత్వం పెంచిన పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు జరిగే పింఛన్ వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. పింఛన్ పెంపుతో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఎంతో లబ్ధి పొందుతున్నారన్నారు.

☛ డోన్ మండలం యాపదిన్నె గ్రామంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, వలంటీర్ రంగనాయకులు చేతులమీదుగా వృద్ధులకు, వితంతువులకు పెంచిన రూ.3వేల సొమ్మును పంపిణీ చేశారు.

చెప్పాడంటే చేస్తాడంతే



సీఎం వైఎస్ జగన్ ఏదైనా చెబితే తప్పకుండా చేస్తాడనే నమ్మకం అందరిలోనూ ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారు. చెప్పనివి కూడా పేద ప్రజల కోసం ఎన్నో చేశారు. పింఛన్ మొత్తం చెప్పినట్లే పెంచుకుంటూ వెళ్లారు. గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకునేందు పంచాయతీ ఆఫీసు వద్ద చాలా ఇబ్బందులు పడ్డాను. ఇప్పుడు వలంటీర్లు ఇంటివద్దకే ఉదయాన్నే వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తున్నారు. సీఎంగా జగనే మళ్లీ రావాలని కోరుకుంటున్నా.

– కుర్వ తిరుమలమ్మ, ఒంటరి మహిళ, పెసరవాయి, గడివేముల మండలం

విద్యారంగానికి సీఎం ప్రాధాన్యత

- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



బీసీ రెసిడెన్సియల్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన, చిత్రంలో ఎంపీ పోచా

బేతంచెర్ల: విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల రూపురేఖలు మార్చేశారని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. గోరుమానుకొండ సమీపంలో రూ. 36 కోట్లతో నిర్మిస్తున్న బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూలు, కళాశాల, రూ. 4 కోట్లతో నిర్మిస్తున్న ఎమ్ఎస్ ఎమ్ఈ, రూ. 35 కోట్లతో నిర్మిస్తున్న ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణ పనులను మంగళవారం నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డితో కలిసి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో మంత్రి చర్చించారు. మరో 15 రోజుల్లో యుద్ధప్రాతిపాదికన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. కళాశాల,స్కూల్ భవంతుల నిర్మాణ ఆకృతుల విషయంలో మంత్రి బుగ్గన ప్రత్యేక చొరవను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి ప్రశంసించారు. విద్య, వైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రాధాన్యత కల్పించి నాడు–నేడు కింద కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ మునిస్వామి, మంత్రి ఓఎస్డీ ప్రతాప్‌రెడ్డి, సీపీ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు విధులకు హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల(అర్బన్): 'అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమ్మెతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలు, గర్భిణులు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను అర్థం చేసుకుని ఈనెల 5వ తేదీలోగా సమ్మెను విరమించి విధులకు హాజరు కావాలి' అని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఒక ప్రకటనలో కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తమ ఆరోగ్యం, పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమ్మెను విరమించాలని సూచించారు. ప్రభుత్వం ఇదివరకే కొన్ని డిమాండ్లను పరిష్కరించిందని, అంగన్‌వాడీ హెల్పర్‌ను కార్యకర్తగా పదోన్నతులు కల్పించే వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ జీవో జారీ చేసిందన్నారు. అలాగే అంగన్‌వాడీ వర్కర్ల గరిష్ట వయో పరిమితిని 62 సంవత్సరాలకు పెంచిందన్నారు. అద్దెలు, పరిపాలన ఖర్చు మొదలైన వాటికి ఇటీవల ప్రభుత్వం బడ్జెట్ మంజూరు చేసిందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు రూ.2 లక్షల ప్రమాద బీమాను అమలు చేసిందని చెప్పారు. 2019 నుంచే వర్కర్ల జీతాలు రూ.11,500, హెల్పర్ల జీతాలు రూ.7వేలకు పెంచిందన్నారు. మిగిలిన డిమాండ్లను ప్రభుత్వం త్వరలో పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ చూపుతుందనానరు. సమ్మె విరమించకపోతే ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అబద్ధాల చంద్రబాబును ప్రజలు నమ్మరు

- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి



శ్రీశైలం అగ్నిప్రమాద బాధితులకు చెక్కులను అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి

నంద్యాల: అబద్ధాల చంద్రబాబు నాయుడు హామీలను ప్రజలు ఎవరూ నమ్మరని, వచ్చే ఎన్నికల్లో జిల్లాలో మళ్లీ వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో టీడీపీ టికెట్ ఎవరికి ఇచ్చినా 50 వేల మెజార్టీతో వైఎస్సార్‌సీపీదే గెలుపు అన్నారు. టీడీపీ ఇన్‌చార్జ్ బుడ్డా రాజశేఖర్‌రెడ్డి నోట వెంట అభివృద్ధి కంటే బూతు మాటలే ఎక్కువగా వస్తాయన్నారు. బుడ్డా రూ.2 వేలు ఇచ్చి రూ.20 వేలు ఇచ్చానని చెప్పుకొనే వ్యక్తి అని విమర్శించారు. శిల్పా కుటుంబానిది 10 మందికి సాయం చేసే గుణమే తప్పా గొప్పలు చెప్పుకొనే తత్వం కాదన్నారు. గత ఎన్నికల్లో చివరి సమయంలో భార్య అనారోగ్యం సాకు చెప్పి బుడ్డా చేతులెత్తేశారని, రెండో సారి సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల సమయంలో చేతులెత్తేశారని, మూడో సారి కూడా చేతులు ఎత్తేయడానికి బుడ్డా సిద్ధంగా ఉన్నాడని విమర్శించారు. సమావేశంలో మహానంది దేవస్థానం చైర్మన్ మహేశ్వరరెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి రజాక్, బుక్కాపురం రామయ్య, నందిపల్లె సాయేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ప్రభుత్వం సాయం..

శ్రీశైల క్షేత్ర పరిధిలో గతేడాది ఆగస్టు 31వ తేదీ జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన 14 మంది దుకాణ యజమానులకు ఒక్కొక్కరికి రూ.4 లక్షలు చొప్పున రూ.56 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రమాద బాధితులకు జిల్లా కలెక్టర్ మనజీర్‌జిలానీ శామూన్, ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం వ్యాపారస్తులు మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో నష్టపోయిన తమకు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి సొంత నిధులు రూ.20వేలు ఇవ్వడమే కాకుండా ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి రూ.4 లక్షలు ఆర్థిక సాయం అందేలా చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. అదే విధంగా నంద్యాల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఫైనాన్స్ నిధుల కింద 14 మందికి రూ.35 లక్షలు, సీఎం ఆర్ఎఫ్ కింద 5 మందికి రూ.6.30 లక్షలు మొత్తం 33 మందికి రూ.97.30 లక్షలు చెక్కులను ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిల్పా మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం నుంచి ఏ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా వెంటనే పరిష్కరించారన్నారు.

ట్రాక్టర్ సీజ్

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరు గ్రామ సమీపంలో చింత మొద్దుల లోడ్‌తో బనగానపల్లె వైపు తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు డీఆర్‌ఓ సుబ్బయ్య శనివారం తెలిపారు. కైప గ్రామానికి చెందిన సలీంబాషా ఎలాంటి అనుమతులు లేకుండా చింత చెట్టు భారీ మొద్దులను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఎర్రగుడి బీట్ ఆఫీసర్ ముక్తియార్ అహమ్మద్ ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారన్నారు. ట్రాక్టర్, మొద్దులను సీజ్ చేసి బనగానపల్లె డీఆర్‌ఓ(డివిజనల్ రేంజ్) కార్యాలయంలో ఉంచినట్లు ఆయన తెలిపారు.

వృద్ధులకు హోమ్ ఓటింగ్

- 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 60 శాతం వికలత్వం ఉన్న వారికి అవకాశం
- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికల సంఘం శ్రీకారం
- ఇంటి వద్ద ఓటు వేసే వారి నుంచి ఫారం-12 స్వీకరణకు చర్యలు
- జిల్లాలో అర్హులైన ఓటర్ల వివరాల సేకరణకు అధికారుల కసరత్తు


ఓటు వేసేందుకు వెళ్తున్న వృద్ధులు (ఫైల్)


పోలింగ్‌బూత్‌కు ట్రైసైకిల్‌లో వచ్చిన దివ్యాంగుడు (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): ఇది వరకు పండుమునలోళ్లు, దివ్యాంగులు శరీరం సహకరించకపోయినా ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సిందే. అయితే, ఇక నుంచి ఆ అవసరం లేదు. ఇంటి దగ్గర ఉండి ఓటు వేయవచ్చు. ఈ మేరకు భారత ఎన్నికల సంఘం 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 60 శాతం కంటే ఎక్కువ శారీరక వికలత్వం కలిగిన ఓటర్లకు ఈ అవకాశం కల్పించింది. అర్హులు వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లోనే హోం ఓటింగ్ ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు.

ఓటు హక్కు వినియోగించుకోవాలన్నదే ప్రధాన ఉద్దేశం

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైంది. అందుకే ఓటును వజ్రాయుధంతో ప్రజాస్వామ్యవాదులు పోల్చుతుంటారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో 18 ఏళ్లు దాటిన వారి నుంచి 100 ఏళ్లు దాటిన వారికి కూడా ఓటు హక్కు ఉంటుంది. ప్రతి ఒక్కరూ ప్రతి ఐదేళ్లకు జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకొని సమర్థవంతమైన నాయకులను పాలకులుగా ఎన్నుకోవాలి. ఈ క్రమంలో 80 ఏళ్లు దాటిన ఓటర్లు, 60 శాతం కంటే ఎక్కువ వికలత్వం ఉన్న వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో భారత ఎన్నికల సంఘం నమోదైన ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 60 శాతం శారీరక వికలత్వం ఉన్న ఓటర్లు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంది.

ఆసక్తి ఉన్న ఓటర్ల వివరాల సేకరణకు చర్యలు

జిల్లాలోని కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో ముసాయిదా జాబితా ప్రకారం 19,71,325 మంది ఓటర్లు ఉండగా, ఆ సంఖ్య డిసెంబర్ 26వ తేదీ నాటికి 20,06,721కు చేరుకుంది. ఈక్రమంలో ఆజాబితాలో హోం ఓటింగ్ ఆప్షన్‌ను ఎంచుకునేందుకు ఆసక్తి చూపే ఓటర్ల వివరాలను సేకరించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కొంత మంది పోలింగ్ అధికారులను ప్రత్యేకంగా నియమించింది.

ఫారం-12 ద్వారా హోం ఓటింగ్..

ఎన్నికలు జరిగే తేదీకి మూడు రోజుల ముందు హోం ఓటింగ్‌కు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. వారి నుంచి ఫారం -12 సేకరించి దాని ఆధారంగా పోస్టల్ బ్యాలెట్ మాదిరిగా హోం ఓటింగ్ అవకాశాన్ని కల్పిస్తారు. హోం ఓటింగ్ విధానం ఇప్పటికే తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్‌తో పాటు పలురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు వర్తింపజేశారు. త్వరలో జరిగే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లోనూ హోం ఓటింగ్ విధానాన్ని అమలు చేస్తుండడంతో అధికారులు అందుకోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

హోం ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నాం



ఇప్పటికే దేశంలో చాలా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో హోం ఓటింగ్ విధానం అమల్లోకి వచ్చింది. పార్లమెంట్‌తోపాటు ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ హోం ఓటింగ్ విధానం ద్వారా 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 60 శాతం శారీరక వికలత్వం ఉన్న వారు ఓటు వేయవచ్చు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో అలాంటి వారి వివరాలను సేకరించేందుకు ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేశాం. వీరికి ఫారం-12 ద్వారా ఇంటి నుంచే పోస్టల్ బ్యాలెట్ మాదిరిగా ఓటు హక్కు కల్పిస్తాం.

– డాక్టర్ జి.సృజన, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

మహిళ అదృశ్యం


మౌనిక

కర్నూలు: కల్లూరు ఎస్టేట్‌లోని చింతలముని నగర్‌కు చెందిన వీరేష్ బాబు భార్య మౌనిక (33) అదృశ్యమైంది. ఈనెల 1వ తేదీన గుడికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి ఇంతవరకు తిరిగి రాలేదు. ఆమె కోసం బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద భర్త ఆరా తీశాడు. కర్నూలు నగరంతో పాటు చుట్టుముట్టు గ్రామాల్లో గాలించినా కనిపించలేదు. దీంతో భర్త వీరేష్ బాబు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సుమారు 5 అడుగుల ఎత్తు ఉండి, తెలుపు వర్ణం ఉంటుందని, ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఆకుపచ్చని చీర ధరించినట్లు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కొంతకాలంగా మతిస్థిమితం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 79974 86371 లేదా 90003 04253 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని భర్త వీరేష్ బాబు విజ్ఞప్తి చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి


యు.కిశోర్ (ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్: బైక్ ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ యు. కిశోర్(41) కోలుకోలేక మంగళవారం మృతి చెందాడు.ఆదోని పట్టణంలోని నాన్ శిల్పా కాలనీలో నివాసముండే కిశోర్ ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. డిసెంబర్ 31వ తేది రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ ఓ ప్రైవేట్ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య దివ్యభారతి, కుమార్తెలు భావన (4వ తరగతి), అఖిల(3వ తరగతి) ఉన్నారు. కానిస్టేబుల్ కిశోర్ మృతి పట్ల తోటి పోలీస్ సిబ్బంది, స్నేహితులు సంతాపం తెలిపారు.

ఈ-హాస్పిటల్ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ


సమావేశంలో మాట్లాడుతున్న పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఈ-హాస్పిటల్ నిర్వహణలో ఆసుపత్రిలోని పలు విభాగాలు ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నట్లు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి అభినందించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో ఆరోగ్యశ్రీ, ఈ-హాస్పిటల్ అమలుపై అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆరోగ్యశ్రీ కేసులకు సంబంధించి మెడికల్, గైనిక్, సర్జరీ విభాగాలు మరింత బాగా అమలు చేయాలని సూచించారు. ఈ-హాస్పిటల్ అమలులో ఆగస్టు నుంచి జనవరి వరకు ఉత్తమ ప్రతిభ కనబరిచిన సైకియాట్రి విభాగాధిపతికి ల్యాప్‌టాప్ బహూకరించి అభినందించారు. ఇదే సందర్భంలో సమీక్ష సమావేశానికి హాజరుకాని పలు విభాగాల వైద్యులకు మెమోలు జారీ చేశారు. ఇకపై ఆసుపత్రిలో తనతో పాటు ఇతర వైద్యాధికారులు ఆకస్మికంగా తనిఖీ చేస్తారన్నారు. తనిఖీ సమయంలో విధుల్లో లేని వైద్యులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, సీఎస్ఆర్‌ఎంఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్‌ఎంఓ డాక్టర్ హేమనళిని, హెచ్‌వోడీలు డాక్టర్ లక్ష్మీబాయి, డాక్టర్ రాధారాణి, డాక్టర్ శ్రీనివాసులు, ఆర్‌ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, ఏడీ అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు

కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం సాయంత్రం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్యాజువాలిటీలో తనిఖీ చేసే సమయంలో జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డ్యూటీలో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమో జారీ చేశారు. అనంతరం ఆయన ఎంసీహెచ్‌లోని గైనిక్, ఎమర్జెన్సీ విభాగాలను తనిఖీ చేసి రోగుల వివరాలను కనుక్కున్నారు. ఆయన వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ ఉన్నారు.

అందరికీ ఆరోగ్య భాగ్యం

- రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రారంభం
- మొదటి రోజు 12 వైద్య శిబిరాలకు విశేష స్పందన
- 5,100 మందికి వైద్య పరీక్షలు


గడివేముల వైద్య శిబిరంలో వృద్ధురాలికి కళ్లజోడు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

నంద్యాలటౌన్: వైద్య రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక మార్పులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి విడత విజయవంతమైన నేపథ్యంలో రెండవ విడత శిబిరాలు జిల్లాలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రతి మంగళ, శుక్ర వారాల్లో గ్రామాల్లో, ప్రతి బుధవారం పట్టణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 12 శిబిరాలకు విశేష స్పందన వచ్చింది. ప్రతి శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టులు, ఇద్దరు ఎంబీబీఎస్ స్థాయి వైద్యులు చికిత్స అందించారు. స్పెషలిస్టులలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఈఎన్టీ, ఆర్థోపెడిక్, పెథాలజీ తదితర విభాగాల వైద్యులు ఉన్నారు. సగటున ప్రతి క్యాంపులో ఓపీకి దాదాపు 430 మంది దాకా ప్రజలు చికిత్స కోసం వచ్చినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు దాదాపు 5,100 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెరుగైన చికిత్స నిమిత్తం పది మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

- పాణ్యం నియోజకవర్గం గడివేముల మండలం కొరటమద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యమే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. అధికారులు మరింత ఉత్సాహంతో పని చేసి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జిల్లా వైద్యారోగ్యాధికారి వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిబిరాలు వినియోగించుకోవాలని కోరారు.
- బనగానపల్లె మండలం యాగంటి గ్రామంలో, అవుకు మండల కేంద్రం అవుకు -2 సచివాలయ పరిధిలో, వెలుగోడు సచివాలయ -5 పరిధిలో, ఆళ్లగడ్డ మండలం బాచుపల్లి గ్రామంలో, శిరివెళ్ల మండలం చెన్నూరులో, రుద్రవరం మండలం కోటకొండలో, ఆత్మకూరు మండలం కురుకుంద, మిడుతూరు మండలం మాసాపేట, ఉయ్యాలవాడ మండలం అల్లూరు గ్రామాల్లో వైద్య శిబిరాలు ప్రారంభించి వైద్య సేవలు అందించారు. ఓపీ నుంచి చికిత్సల వరకు అన్ని రకాల సేవలు ఉచితంగా అందజేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- వాహనదారులెవరూ ఆందోళన చెందొద్దు
- జేసీ నారపురెడ్డి మౌర్య


బుధవారపేటలోని పెట్రోల్ బంకులో నో స్టాక్ బోర్డు


పోలీసు పెట్రోల్‌బంకు వద్ద క్యూలో వాహనదారులు

కర్నూలు(సెంట్రల్): పెట్రో ఉత్పత్తులను కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జేసీ నారపురెడ్డి మౌర్య హెచ్చరించారు. ప్రస్తుతం జిల్లాలోని పెట్రోల్ బంకుల్లో పెట్రోల్, డీజిల్ కొరత లేదని, వాహనదారులెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని ఆమె తెలిపారు. మంగళవారం ఆమె సాక్షితో మాట్లాడుతూ.. హిట్ అండ్ రన్ చట్టంపై ట్రక్కు డ్రైవర్లు చేస్తున్న సమ్మె ప్రభావం జిల్లాలో లేదన్నారు. ఈ చట్టం ప్రకారం ప్రమాదాలు జరిగిన సమయాల్లో డ్రైవర్ బతికి ఉంటే ప్రమాద విషయాన్ని పోలీసులకు తెలపాల్సి ఉంటుందన్నారు. అయితే, ప్రస్తుతం కొందరు డ్రైవర్లు ప్రమాద విషయం తెలపకుండా పరారవుతుండడంతో కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ చట్టాన్ని తెచ్చిందన్నారు. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆయిల్ ట్రక్కుల డ్రైవర్లు, ఆపరేటర్లు మూడు రోజులపాటు సమ్మెకు వెళ్లడంతో వాహనదారుల్లో పెట్రోల్ కొరత ఏర్పడుతుందనే భయం నెలకొందన్నారు. ఈక్రమంలోనే మంగళవారం రాత్రి అక్కడక్కడా పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరినట్లు తమకు సమాచారం ఉందన్నారు. కాగా, కర్నూలులోని బుధవారపేటలో ఉన్న రెండు పెట్రోల్ బంకుల్లో స్టాక్ లేదని నిర్వాహకులు బోర్డు పెట్టి మూసి వేశారు. అయితే, ఈ రెండు పెట్రోల్ బంకుల్లో నిజంగా స్టాక్‌లేకపోవడంతోనే నో స్టాక్ బోర్డులు పెట్టారా? లేదంటే కృత్రిమ కొరతను సృష్టించి అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నా విషయాలు తెలియాల్సి ఉంది.

జొన్న రైతులకు ప్రభుత్వం అండ



మాట్లాడుతున్న జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

- మద్దతు ధరతో జొన్నల సేకరణ
- జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: జొన్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందని జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో మంగళవారం జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జొన్న పంటకు మద్దతు ధరపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఏదో విధంగా వీలైనంత ఎక్కువ ధర అందించడమే సీఎం లక్ష్యమన్నారు. పంట సాగు చేసింది మొదలు కొనుగోలు వరకు ప్రభుత్వం రైతుల వెన్నంటే ఉంటూ అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. ఇందులో భాగంగా జొన్న రైతులకు అండగా ఉండటంతో పాటు రైతుల నుంచి సేకరించిన జొన్నలను సివిల్ సప్లై ద్వారా కార్డు దారులకు అందించేందుకు జొన్నల సేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. ఇందు కోసం ప్రభుత్వం హైబ్రిడ్ జొన్నలకు రూ. 3,185, మల్దండి జొన్నలకు రూ. 3,225 మద్దతు ధరగా నిర్ణయించడం జరిగిందన్నారు. రైతుల కల్లాల దగ్గరకే వచ్చి కొనుగోలు చేయడంతో పాటు కూలీలు, గోనె సంచులు, ట్రాన్స్ పోర్ట్ ఖర్చులు అన్నీ ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్‌మెన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీపీలు గజ్జల రాఘవేంద్రారెడ్డి, వీరభద్రుడు, ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, సివిల్ సప్లై డీఎం రాజు ఉన్నారు.

సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలి

- మండలాధికారులకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్) : జనవరి, ఫిబ్రవరి మాసాల్లో అమలయ్యే సంక్షేమ పథకాలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని అమలు చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన మండలాధికారులను ఆదేశించారు. వైఎస్ఆర్ పెన్షన్ కానుక, ఆసరా, చేయూత , ఆడుదాం-ఆంధ్ర పథకాలపై ప్రజాప్రతినిధులతో కలసి సభలు ఏర్పాటు చేసి లబ్ధిదారులకు చేరువ చేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెంచిన పెన్షన్‌ను జనవరి 1 నుంచి 8వ తేదీ వరకు పండుగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై పంపిణీ చేసేలా చూడాలన్నారు. జనవరి 23 నుంచి 30వ తేదీ వరకు వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత కింద మంజూరైన నిధులను పొదుపు మహిళల ఖాతాల్లో జమ చేస్తామని, ఇందు కోసం జనవరి 18 నుంచే విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఫిబ్రవరి 5 నుంచి 14 వ తేదీ వరకు 45 ఏళ్లు నిండిన మహిళలకు వైఎస్ఆర్ చేయూత సాయాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జనవరి 5వ తేదీన సంక్షేమపథకాలకు అర్హులై ఉండి మిగిలిన పోయిన వారికి వర్తింపజేసే కార్యక్రమం ఉంటుందన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడలను ప్రతి రోజూ ఎంపీడీఓలు, తహసీల్దార్లు, కమిషనర్లు సందర్శించి నిర్వహణపై సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. జిల్లాకు ఇప్పటి వరకు 35,324 ఆరోగ్య శ్రీకార్డులు వచ్చాయని, అయితే అందులో 6 వేల కార్డులను మాత్రమే పంపిణీ చేశారన్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, కోడుమూరు, వెల్దుర్తి, పెద్దకడబూరు, కల్లూరు, మంత్రాలయం, కౌతాళం మండలాల్లో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ శాతం చాలా తక్కువగా ఉందన్నారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. ఆడుదాం-ఆంధ్రలో మిగిలిన పోయిన పోటీలను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డితోపాటు పలువురుజిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్య

నందికొట్కూరు: పట్టణంలోని మార్కెట్ యార్డులో ఓ వ్యక్తి శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ హుస్సేన్‌బాషా తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణంలోని పాన్‌షాపు నడుపుకుంటు సత్యనారాయణ జీవనం సాగిస్తున్నారు. జనవరి 1వ తేదీన మధ్యాహ్నం భోజనానికి ఇంటికి బయలుదేరిన అతను బస్సు ఎక్కి నందికొట్కూరుకు చేరుకున్నాడు. సోమవారం అర్ధరాత్రి మార్కెట్ యార్డుకు వెళ్లి అక్కడ శరీరంపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని కేకలు వేయడంతో స్థానికులు మంటలు ఆర్పి 108లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అతని దగ్గర లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

తల్లి గురించి అసభ్యంగా మాట్లాడాడని..

- వీడిన యువకుడి హత్య కేసు మిస్టరీ
- నిందితుడిని జువైనల్ హోంకు తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ హనుమంతు నాయక్

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలో గత నెల డిసెంబర్ 29వ తేదీన జరిగిన కారు డ్రైవర్ అస్లాం హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. తన తల్లి గురించి అసభ్యంగా మాట్లాడటంతోనే అంతమొందించినట్లు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించాడు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతునాయక్ స్థానిక ఎస్‌ఐ రమణయ్యతో కలిసి మంగళవారం కేసు వివరాలు వెల్లడించారు. హతుడు అస్లాం చాగలమర్రిలోని కూలూరు రస్తాలో నివాసముంటాడు. ఇతను స్నేహితుడు, నిందితుడు అయిన సుభాహాన్‌తో కలిసి తరచుగా మద్యం సేవిస్తుంటాడు. అయితే, 8 నెలల క్రితం ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సుభాహాన్ తల్లి గురించి మద్యం మత్తులో అస్లాం తరచుగా అసభ్యంగా మాట్లాడేవాడు. వారించినా తీరు మార్చుకోకపోవడంతో హత్య చేయాలని సుభాహాన్ పథకం రచించాడు. ఇందులో భాగంగా గత నెల 29వ తేదీ రాత్రి హతుడిని సాధిక్ అనే మరో స్నేహితుడి ఇంటిపైకి తీసుకెళ్లాడు. అక్కడ ఇరువురు మద్యం సేవించారు. తర్వాత వెంట తెచ్చుకున్న కారం పొడిని అస్లాం కళ్లలో చల్లి కత్తితో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని మంగళవారం స్థానిక మల్లెవేముల బస్టాండు సమీపంలో అరెస్టు చేసి, కత్తిని స్వాధీన పరుచుకున్నారు. కాగా నిందితుడు మైనర్ కావడంతో జువైనల్ హోంకు తరలించినట్లు సీఐ వెల్లడించారు.